

కేసీఆర్ బర్త్‌డే వేడుకల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు బీమా చెక్కును అందజేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎంపీలు కేశవరావు, రంజిత్‌రెడ్డి, మేయర్ విజయలక్ష్మి, తలసాని సాయికిరణ్

కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుంటున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, పల్లా, వేముల, నాగేందర్, కౌశిక్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు

వైభవంగా కేసీఆర్ జన్మదినోత్సవం

దేశవిదేశాల్లో, రాష్ట్రమంతటా వేడుకలు ● రక్తదానం.. మొక్కలు నాటిన కార్యకర్తలు

- ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా పత్రాలు
- దివ్యాంగులకు వీల్‌చైర్లను పంపిణీ చేసిన కేటీఆర్
- తెలంగాణ భవన్‌లో 70 కిలోల కేక్
- ఉద్యమనేతపై డాక్యుమెంటరీ ప్రదర్శన
- శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్, ముఖ్యమంత్రి రేవంత్

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఉద్యమ సారథి, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు 70వ జన్మదిన వేడుకలు శనివారం రాష్ట్రమంతటా వైభవంగా జరిగాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన సంబరాలకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తోపాటు పార్టీ సీనియర్ నాయకులు, శ్రేణులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సంబురాల ఏర్పాట్లను సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇంచార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ నిర్వహించారు. కేటీఆర్ తదితర నేతలు ముందుగా తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం సాయికిరణ్ యాదవ్ సహకారంతో వెయ్యి మంది ఆటో డ్రైవర్లకు ఒక్కొక్కరికీ రూ.లక్ష కవరేజీతో కూడిన ఇన్సూరెన్స్ పత్రాలను, 10 మంది దివ్యాంగులకు వీల్‌చైర్లను మాజీ మంత్రి కేటీఆర్ అందజేశారు. ప్రత్యేకంగా చేయించిన 70 కిలోల భారీ కేక్‌ను బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి కేటీఆర్ కట్ చేశారు. కేసీఆర్‌పై రూపొందించిన 'అతనే ఒక చరిత్ర' డాక్యుమెంటరీని వీక్షించారు.



కేసీఆర్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా పార్టీ కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కును అందజేస్తున్న బీఆర్ఎస్ నేతలు మహమూద్ అలీ, రావుల, సోమా భరత్‌కుమార్

కార్యకర్తల కుటుంబాలకు చెక్కుల పంపిణీ

పార్టీ కార్యకర్తల కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహమూద్ అలీ చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వం కలిగి ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది కార్యకర్తల కుటుంబాలకు ఒకొక్కరికి రూ.2 లక్షల చొప్పున ప్రమాద బీమా కింద మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పార్టీ ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌కుమార్, సీనియర్ నాయకులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీలు రంజిత్‌రెడ్డి, బీబీ పాటిల్, బడుగుల లింగయ్యయాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్‌లు అనిల్‌కుమార్ కూర్మాచలం, వాసుదేవరెడ్డి, దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, మేడే రాజీవ్ సాగర్, సతీశ్‌రెడ్డి, మసి ఉల్లా ఖాన్, మాజీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి: గవర్నర్

> తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఆనందంగా జీవించాలని ప్రత్యేకంగా ఓ లేఖ ద్వారా విషెస్ పంపారు. కేసీఆర్ చేసే అన్ని ప్రయత్నాల్లో విజయం వరించాలని గవర్నర్ ఆకాక్షించారు. గవర్నర్ కార్యాలయం నుంచి వచ్చిన ప్రతినిధి తెలంగాణ భవన్‌లో మాజీమంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు పుష్పగుచ్ఛం, శుభాకాంక్షల లేఖను అందజేశారు.

హ్యాపీ బర్త్ డే డాడ్: కేటీఆర్

> తన తండ్రి 70వ పుట్టినరోజు సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ చేసిన ట్వీట్ నెట్టింట వైరల్‌గా మారింది. కేవలం గంటలోనే 6వేల లైకులతో ట్విటర్‌లో దూసుకెళ్తున్నది. 'మై హీ రో.. లెజెండ్‌గా పిలువబడే కేసీఆర్.. నాన్నా 70వ జన్మదిన శుభాకాంక్షలు' అంటూ కేటీఆర్ ట్వీట్ చేయగా, గంటలోనే 77వేల వ్యూస్ వచ్చాయి. వేలాది మంది నెటిజన్లు రీట్వీట్లు, కామెంట్లతో శుభాకాంక్షలు తెలుపుతున్నారు.

ఓయూ ప్రాంగణంలో..

కేసీఆర్ 70వ పుట్టినరోజును ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో బీఆర్ఎస్వీ అధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ కేక్ కట్ చేసి, మొక్కలు నాటారు.

సీఎం రేవంత్ శుభాకాంక్షలు

రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అసెంబ్లీలో శనివారం సీఎం రేవంత్ మాట్లాడు తూ.. ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర మంత్రిగా, తెలంగాణ సీఎంగా బాధ్యతలు నిర్వహించి.. 40 ఏండ్లుగా రాష్ట్ర, కేంద్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గారికి కాంగ్రెస్ పక్షాన జన్మదిన శుభాకాంక్షలు అని చెప్పా రు. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతిపక్షనేతగా సభను సజావుగా నడపడానికి.. తెలంగాణ సమాజాన్ని అభివృద్ధిపథంలో నడపడానికి దేవుడు కేసీఆర్‌కు శక్తినివ్వాలని, ఆ యురారోగ్యాలు ప్రసాదించాలని సీఎం అకాంక్షించారు.

కువైట్‌లో మొక్కలునాటిన ఎన్నారైలు

కేసీఆర్ పుట్టినరోజును దేశవిదేశాల్లోని ఘనంగా జరుపుకున్నారు. కువైట్‌లో ఎన్నారై కువైట్ అధ్యక్షురాలు అభిలాష గొడిశాల మొక్కలునాటి కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ నిండునూరేండ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఆమె అకాంక్షించారు.

ముంబై, భివండీలో

కేసీఆర్ జన్మదిన వేడుకలను ముంబై, భివండీ పట్టణంలో వలసజీవులు ఘనంగా నిర్వహించారు. ప్రఖ్యాత అంతర్జాతీయ కళాకారిణి డా క్టర్ రాధామోహన్ కేక్ కట్ చేశారు. లాంగ్ లివ్ కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముక్రా(కే)లో శనివారం రైతులు పొలాల మధ్య కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గజ్వేల్‌కు చెందిన రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామరాజు సబ్బుబిల్లపై కేసీఆర్ చిత్రపటాన్ని రూపొందించారు. దానిపై 'రైతు బాంధవుడా'అని రాశారు. కేసీఆర్‌కు టీఆర్వీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడూరి ప్రకాశ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, దమ్మపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, సత్తుపల్లిలో సంద్ర వెంకటవీరయ్య, బోనకల్‌లో జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

● బర్త్‌డే ప్లాంట్

మొక్కలు నాటిన జే సంతోష్‌కుమార్

గ్రీన్ ఇండియా చాలెంజ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన బీఆర్ఎస్ నేత సంతోష్‌కుమార్ కేసీఆర్ పుట్టిన రోజు సందర్భంగా మూడు హిమాయత్ పసంద్ మామిడి మొక్కలు నాటారు. గ్రీన్ ఇండియా చాలెంజ్‌లో చేరండి అని పిలుపునిస్తూ ట్వీట్ చేశారు.

● గిఫ్ట్ ఏ స్మైల్

కేసీఆర్ బర్త్ డే సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సేవా ధృక్పథాన్ని చాటుకున్నారు. గిఫ్ట్ ఏ స్మైల్‌లో భాగంగా పెద్దపల్లి జిల్లా విలేజ్ అంతర్గాం గ్రామానికి చెందిన నిరుపేద వృద్ధురాలు కాంపెల్లి ఎల్లమ్మకు ఇంటిని నిర్మించారు. శనివారం ఆమెతో గృహప్రవేశం చేయించారు. కేసీఆర్ నిండునూరేండ్లు ఆయురారోగ్యాలతో సంతోషంగా జీవించాలని ప్రార్థించారు.

● పంటలు పోతున్నయ్.. నీళ్లియ్యండి

ముస్తాబాద్, ఫిబ్రవరి 17: రాజన్న సిరిసిల్ల జిల్లా బంధనకల్, వెంకట్రావుపల్లె సిద్దిపేట జిల్లా మాచాపూర్ గ్రామ రైతులు ఆందోళనకు దిగారు. సిద్దిపేట-ముస్తాబాద్ హైవేపై వెంకట్రావుపల్లె వద్ద ధర్నా చేశారు. యాసంగి పంటలకు రంగనాయకసాగర్ ప్రాజెక్టు కాల్వల ద్వారా నీటిని విడుదల చేసి చెరువులను నింపాలని కోరారు.

సోషల్ మీడియాకు పెరిగిన క్రేజ్: కోమటిరెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): మీడియా మాధ్యమాలతోపాటు సోషల్ మీడియాకూ ఎంతో క్రేజ్ పెరిగిందని సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. హైదరాబాద్ టీ హబ్‌లో శనివారం జరిగిన టీఎస్ఎఫ్ఏ డిజిటల్ అవార్డ్స్-2023 ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన షార్ట్ ఫిల్మ్‌ల విజేతలకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా తెలుగు స్టేట్ ఫిల్మ్ అవార్డ్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. నేటి యువతను స్టార్స్‌గా తయారు చేయడంలో సోషల్ మీడియా గొప్ప పాత్ర పోషిస్తున్నదని కోమటిరెడ్డి తెలిపారు. దానిద్వారా స్వయం ఉపాది కూడా పొందుతున్నారని వివరించారు.

చలమల రాజకీయాలకు పనికిరాడు

- ఆయనను పార్టీలో ఎలా చేర్చుకున్నారు?
- నాపై అడ్డగోలుగా మాట్లాడారు
- కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఫైర్

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): తన నియోజకవర్గానికి చెందిన చలమల కృష్ణారెడ్డిని పార్టీలో చేర్చుకోవడంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయనకు అసలు వ్యక్తిత్వమే లేదని విమర్శించారు. తనపై అడ్డగోలుగా మాట్లాడిన వ్యక్తిని తనకు తెలియకుండా ఎలా చేర్చుకుంటారని ప్రశ్నించారు. శాసనసభ లాబీల్లో శనివారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తనకు తెలియకుండానే చలమలను చేర్చుకున్నారని, ఆయన చేరిక చెల్లదని పేర్కొన్నారు. అసలు ఆయన రాజకీయాలకే పనికిరాడని విమర్శించారు. తన వల్ల కాంగ్రెస్‌కే లాభమని, అందుకే వారు పిలిస్తేనే పార్టీలో చేరి మునుగోడులో గెలిచి వచ్చానని తెలిపారు. తనవల్ల లాభపడుతుందనే కాంగ్రెస్ తనను పిలిచి చేర్చుకున్నదని, కానీ చలమల వల్ల పార్టీకి ఎలాంటి ఉపయోగమూ ఉండదని స్పష్టం చేశారు. డబ్బుతో ఆయన రాజకీయం చేయాలని అనకుంటున్నాడని మండిపడ్డారు.

● అన్నారం బరాజ్ నుంచి నీటి విడుదల

కాళేశ్వరం, ఫిబ్రవరి 17: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని అన్నారం బరాజ్ నుంచి నీటిని దిగువకు వదులుతున్నారు. గతంలో 38, 28, 35వ గేట్లు, సీపేజ్‌లకు కెమికల్‌తో గ్రౌటింగ్ చేసి నీరు వెళ్లకుండా అరికట్టారు.

కులగణనకు చట్టబద్ధత కల్పించాలి

- తక్షణమే అసెంబ్లీలో చట్టాన్ని ఆమోదించాలి
- కులగణన తీర్మానం కంటితుడుపు చర్య: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- వెంకటరెడ్డికి బీసీలంటే గౌరవం లేదు: గట్టు
- కులాల ఆత్మగౌరవాన్ని కేసీఆర్ గుర్తించారు : పొన్నాల

శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, చిత్రంలో మాజీ స్పీకర్ మధుసూదనాచారి, పొన్నాల, గట్టు తదితరులు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసిన కుల గణనకు వెంటనే చట్టబద్ధత కల్పించాలని జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. యునైటెడ్ పూలే ఫ్రంట్ నాయకులతో కలిసి శనివారం ఆమె తన నివాసంలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ తన మ్యానిఫెస్టోలో చెప్పినట్టుగా బీసీ సబ్‌ప్లాన్‌కు చట్టబద్ధత కల్పించాలని పేర్కొన్నారు. చూస్తుంటే కులగణన తీర్మానం కంటితుడుపు చర్యలా ఉందని, బీసీ కులగణన ఎప్పటిలోగా పూర్తిచేస్తారు? ఎలా చేస్తారు? బడ్జెట్‌లో కేటాయించిన నిధులెన్ని? దాని లక్ష్యాలేమిటి? అన్న విషయంలో స్పష్టత లేదని విమర్శించారు. తీర్మానానికి తలాతోక లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ, బీహార్, కర్ణాటకలో కులగణనకు ముందు చట్టం చేశారని తెలిపారు. బీహార్‌లో కులగణన చేపట్టి 75 శాతం రిజర్వేషన్లు పెంచుకున్నారని, వెనుకబడిన కులాలకు 25 శాతం రిజర్వేషన్లు పెంచినట్టు పేర్కొన్నారు. అక్కడ బీసీలకు 43శాతం రిజర్వేషన్లు పెంచారని తెలిపారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టుగా బీసీలకు ఇస్తానన్న రూ. 20 వేల కోట్లు పూర్తిగా ఇవ్వాలని, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో పెట్టాలని కవిత డిమాండ్ చేశారు.

కొమటిరెడ్డికి బీసీలంటే గౌరవం లేదు

మహాత్మాపూలే విగ్రహాన్ని అసెంబ్లీలో పెట్టాలని తాము డిమాండ్ చేస్తే మంత్రులు వ్యంగ్యంగా మాట్లాడుతున్నారని, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి వెటకారం చేస్తున్నారని యూనైటెడ్ పూలే ఫ్రంట్ కన్వీనర్ గట్టు రామచందర్‌రావు మండిపడ్డారు. అసెంబ్లీలో పెట్టిన తీర్మానంతో బీసీ సమస్యలు తీరిపోయినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని ఎమ్మెల్సీ మధుసూదనాచారి విమర్శించారు. కాంగ్రెస్ ప్రవేశపెట్టిన తీర్మానంలో అనేక అనుమానాలు ఉన్నాయని తెలిపారు. కులాల వారీగా అందరి ఆత్మగౌరవం కాపాడిన ఏకైక నాయకుడు కేసీఆర్ ఒక్కరేనని యూపీఎఫ్ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య ప్రశంసించారు. ఈ సందర్భంగా కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూపీఎఫ్ నాయకులు బొల్ల శివశంకర్, తాడూరి శ్రీనివాస్, రాజారాం యాదవ్, ఆలకుంట్ల హరి, కోల శ్రీనివాస్, ఆర్వీ మహేందర్, విజేందర్ సాగర్, ఏల్చల దత్తాత్రయ, గీతా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకోండి

కాంగ్రెస్ పార్టీది బీసీ వ్యతిరేక చరిత్ర అని ఎమ్మెల్సీ కవిత విమర్శించారు. 2011లో యూపీఏ హయాంలో చేసిన కులగణన నివేదికను కాంగ్రెస్ ఎందుకు బయటపెట్టలేదని ప్రశ్నించారు. తమను అనేముందు కాంగ్రెస్ ఒకసారి వెనక్కి తిరిగి చూసుకోవాలని చురకలంటించారు. రాబోయే రోజుల్లో యూత్, ఎస్సీ, ఎస్టీ, రైతు డిక్లరేషన్ల గురించి కూడా ప్రశ్నిస్తామని, బీసీ అంశాలు కాలపరిమితితో కూడుకున్నవి కాబట్టి ఇప్పటి నుంచే డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. నాడు బీఆర్ఎస్ పార్టీ బీసీ కులగణన చేయాలని, బీసీలకు ప్రత్యేకంగా మంత్రిత్వశాఖ కేటాయించాలని తీర్మానం చేసి కేంద్రానికి పంపినట్టు గుర్తు చేశారు. బీసీల హక్కుల గురించి తాము మాట్లాడుతుంటే సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి సంకుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

విద్యుత్తు ఆఫీసులకు తాళాలేస్తాం

- డైరెక్టర్ పోస్టుల్లో 50% బీసీలకే ఇవ్వాలి: ఆర్‌కృష్ణయ్య డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): విద్యుత్తు సంస్థల డైరెక్టర్ పోస్టుల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో శనివారం జరిగిన మీడియాతో సమావేశంలో విద్యుత్తు బీసీ ఉద్యోగుల అసోసియేషన్ నేతలతో కలిసి మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లు కల్పించకపోతే విద్యుత్తు సంస్థల కార్యాలయాల గేట్లకు తాళాలేస్తామని హెచ్చరించారు. డైరెక్టర్ల వయో పరిమితిని కూడా 65 ఏండ్లకు పెంచాలని కోరారు. సంస్థలో బీసీ ఉద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని తెలిపారు. ఉన్నతస్థాయి హోదాల్లో బీసీ అధికారులు నామమాత్రంగానే ఉన్నారని పేర్కొన్నారు. పదోన్నతుల్లో బీసీ రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నేత గుజ్జ కృష్ణ, విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకన్నగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కులగణన తీర్మానానికి చట్టబద్ధత తేవాలి

- బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు సురేశ్

హైదరాబాద్, ఫిబ్రవరి17 (నమస్తే తెలంగాణ): కులగణన తీర్మానానికి చట్టబద్ధత తేవాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు సురేశ్ ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమగ్ర కులగణన తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని, అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలుపడం హర్షనీయమని కొనియాడారు. కులగణన తీర్మానం అస్పష్టంగా ఉన్నదని, జ్యుడీషియల్ కమిషన్, ప్రత్యేక బిల్లు ప్రవేశపెడితే తెలంగాణ ప్రజానీకానికి మరింత ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. చట్టబద్ధత లేకపోతే లక్ష్యం నెరవేరదని తెలిపారు. బీసీలకు ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు కనీసం ఆరు మంత్రి పదవులను, 10 ఎంపీ సీట్లను కేటాయించాలని కోరారు. బీఆర్ఎస్ బీసీలకు కేటాయించిన నాలుగు మంత్రి పదవులనైనా కాంగ్రెస్ ప్రభుత్వం కేటాయించలేదని ధ్వజమెత్తారు. బీసీ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు ఈ వార్షిక బడ్జెట్లో రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సీఎం వోలో బీసీలకు సముచిత ప్రాధాన్యం కల్పించలేదని విమర్శించారు.

ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడుతున్న మందకృష్ణ

- వంగపల్లి శ్రీనివాస్

ముషీరాబాద్,ఫిబ్రవరి 17: మాదిగల ఆత్మగౌరవాన్ని మందకృష్ణ మాదిగ వివిధ పార్టీల వద్ద తాకట్టు పెడుతున్నారని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ విమర్శించారు. హైదరాబాద్ విద్యానగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆయన ఆత్మగౌరవ ఉద్యమాన్ని బానిసత్వంవైపు నడపాలని చూస్తున్నారని ఆరోపించారు. అసలు వర్గీకరణ ఉద్యమాన్నే పక్కనపెట్టి పూటకో పార్టీ వైపు మొగ్గు చూడటమేకాకుండా, నేతల కాళ్లు పట్టుకుంటూ సోయి తప్పి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మందకృష్ణ అండగా నిలుస్తున్న మనువాద బీజేపీకి తెలంగాణలో స్థానం లేదని పేర్కొన్నారు. సమావేశం లో గణేశ్, వరలక్ష్మి, కొల్లూరి వెంకట్, వెంకటేశ్, ప్రవీణ్, శ్యామ్‌రావు పాల్గొన్నారు.

మేడారం జాతరకు భారీ ఏర్పాట్లు

- అధికారులతో సీఎస్ టెలికాన్ఫరెన్స్
- 4,800 సీసీ కెమెరాలతో నిఘా
- 4,000 మందితో పారిశుద్ధ్య పనులు
- 5,600 మరుగుదొడ్ల ఏర్పాటు
- ఐదుగురు ఐపీఎస్‌ల పర్యవేక్షణ

హైదరాబాద్/ములుగు, ఫిబ్రవరి 17 (నమస్తే తెలంగాణ): ఆసియాలోనే అతిపెద్దదైన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి చెప్పారు. ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే జాతర నిర్వహణ ఏర్పాట్లపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి సీఎస్ టెలికాన్ఫరెన్స్ సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతికుమారి మాట్లాడుతూ.. జాతరకు ముందుగానే పెద్ద సంఖ్యలో మేడారానికి భక్తులు వస్తున్నారని, జాతర ప్రారంభం నాటికి వారి సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. జాతరలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ బందోబస్తు, చెక్ పోస్టులు ఏర్పాటుచేయాలని సూచించారు. దాదాపు 4,800 సీసీ కెమెరాలను పెట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 6 వేల బస్సులను మేడారానికి నడుపుతున్నామని, మేడారంలో 55 ఎకరాల విస్తీర్ణంలో తాత్కాలిక బస్‌స్టేషన్ ఏర్పాటు చేశామని, ఈ నెల 18 నుంచి 26 వరకు బస్సులను నడుపుతామని, ఇందుకు 9 వేల మంది సిబ్బందిని నియమించామని వివరించారు. పారిశుద్ధ్య నిర్వహణకు 4000 మంది కార్మికులను నియమించామని సీఎస్ చెప్పారు.

ఆకాశాన్నంటుతున్న ధరలు

రెండేండ్లకోసారి జరిగే మేడారం మహాజాతరను కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు, వ్యాపారులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. తల్లుల చెంతకు కోట్లాదిగా తరలివచ్చే భక్తులకు కల్తీ వస్తువులను అంటగడుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. బయట మార్కెట్‌లో చవకగా దొరికే వస్తువులకు.. పదింతలు ధరలు పెంచి భక్తుల జేబులు గుల్ల చేస్తున్నారు. నాసిరకం వస్తువులను బ్రాండెడ్ వస్తువులతో సమానంగా ప్యాకింగ్ చేసి దందా కొనసాగిస్తున్నారు. కాలం చెల్లిన వాటర్ బాటిళ్లు, కూల్‌డ్రింక్‌లను భక్తులకు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మార్కెట్‌లో రూ.20కి దొరికే లీటర్ వాటర్ బాటిల్‌ను రూ.50, రూ.20 లభించే కూల్‌డ్రింక్‌ను రూ.50, రూ.20ల కొబ్బరికాయను రూ.50 నుంచి రూ.60 వరకు, రూపాయికి దొరికే పసుపు, కుంకుమ ప్యాకెట్లను పది రూపాయలకు విక్రయిస్తున్నారు.

30 జన్ సాధారణ్ రైళ్లు

మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వచ్చే భక్తుల కోసం దక్షిణ మధ్య రైల్వే 30 జన్ సాధారణ్ (ప్రత్యేక) రైళ్లను శనివారం ప్రకటించింది.